క్లుప్తంగా

క్రీడాకారుడికి సన్మానం



సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న బిక్కిన

బోట్‌క్లబ్: ఢిల్లీలో జరిగిన వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో మెడళ్లు సాధించిన క్రీడాకారుడు యాళ్ల సురేష్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కోచ్ వినయ్‌కుమార్‌ను కూడా ఆయన అభినందించారు.

శేష వాహనంపై వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: నగరంలోని రామకృష్ణారావుపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి ఆలయ ధర్మకర్త మునగాల గురునాధరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు రామకృష్ణారావుపేటలోని పలు వీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇదిగో.. నేతల ఫ్లెక్సీ



సర్పవరంలో కమ్యూనిటీ హాలుకు ఉన్న కూటమి నేతల ఫ్లెక్సీ

కాకినాడ రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో కోడ్ అమలులో అధికారులు వివక్ష చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన నేతల ఫ్లెక్సీలు కనిపిస్తే పీకిపారేస్తున్న అధికారులు.. కూటమి నేతల ఫ్లెక్సీలపై మాత్రం ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. సర్పవరం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనానికి కూటమి నేతలు ఫ్లెక్సీ దర్శనమిస్తున్నప్పటికీ.. దానిని తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మాజీ క్రికెటర్ రెడ్డి మృతి తీరని లోటు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మాజీ క్రికెటర్ కేఎస్ఆర్‌కే రెడ్డి అకాల మరణం జిల్లా క్రికెట్ రంగానికి తీరనిలోటని జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి పసుపులేటి సత్యన్నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో అండర్-19 నుంచి సీనియర్స్ వరకు ఆడిన రెడ్డి ఇటీవల మరణించారు. క్రికెట్ సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంఘం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సుందర్‌కు మద్దతుగా ప్రచారం



యండమూరులో సుందర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

కరప: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్‌కు మద్దతుగా సోమవారం మండల ఎస్సీ నాయకులు ప్రచారం చేశారు. వేళంగి, జి.భావారం, యండమూరు, కరప, వేములవాడ తదితర గ్రామాల్లో ఎస్సీ నాయకులు మారెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, సాదే లోహిదాస్, సవిలే రాజేష్ తదితరులు పర్యటించి, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిశారు. స్వతంత్ర అభ్యర్థి సుందర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన



పెనుగుదురు-కోటిపల్లి రోడ్డులో వేసిన కోళ్ల వ్యర్థాలు

కరప: జనావాసాల సమీపంలోని రోడ్డు మార్జిన్‌లో కోళ్ల వ్యర్థాలు వేయడంతో దుర్వాసన భరించలేక పెనుగుదురు వంతెన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనుగుదురు-కోటిపల్లి రోడ్డులో మాంసం విక్రయదారులు కోళ్ల వ్యర్థాలను, చచ్చిన కోళ్లను వేస్తున్నారు. ఖాళీ కొబ్బరిబొండాలు కూడా వేయడం వల్ల కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు దుర్వాసన భరించలేక అనారోగ్యాల పాలవుతున్నట్టు విశ్రాంత ఎంఎస్‌ఓ సుబ్బారావు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి జనావాసాలకు సమీపంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ

- సర్కారుపై అంగన్‌వాడీలు, హెల్పర్ల పోరుబాట
- ఎన్నికల హామీలు నెరవేర్చాలంటూ డిమాండ్
- ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఆందోళనలు

కాకినాడ రూరల్: అధికారంలోకి వస్తే.. తెలంగాణ మాదిరిగా అంగన్‌వాడీలకు జీతాలిస్తాం.. తెలంగాణలో వర్కర్లకు వేతనం రూ.18 వేలు ఉంటే.. అదనంగా రూ.2 వేలు కలిపి వేతనం ఇస్తామంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ కూటమి నేతలపై అంగన్‌వాడీలు, హెల్పర్లు మండిపడుతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కూటమి సర్కారుపై వారు పోరుబాట పట్టారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని కూటమి నేతలు హామీ ఇవ్వడంతో పాటు, గ్రాట్యుటీ అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి.. ఐదు నెలలు గడుస్తున్నా చర్చలకు పిలవకపోవడంతో అంగన్‌వాడీలు గుర్రుగా ఉన్నారు. దీనికితోడు తాము చేపట్టిన 42 రోజుల సమ్మెలో మినిట్స్ అమలు చేయాలని కోరుతున్నా కూటమి ప్రభుత్వ నేతలు స్పందించకపోవడంతో నిరసన కార్యక్రమాలు ముమ్మరం చేశారు.

204 అంగన్‌వాడీ సెంటర్లు

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 204 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఆయా సెంటర్లలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారు. వీరంతా తమకు గ్రాట్యుటీ అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని కోరుతున్నారు. అలాగే అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రకరకాల యాప్‌ల్లో విపరీతంగా ఉన్న పనిభారం తగ్గించేందుకు ఒకే యాప్‌ను అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నారు.

రూరల్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద ధర్నా

సర్పవరంలోని కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వీరవేణి, వి.వీరమణి తదితరులు పాల్గొన్నారు.



సర్పవరంలోని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్ట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

వేతనం పెంచాలి



అంగన్‌వాడీ వర్కర్లకు వేతనం పెంచాలి. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.2 వేలు అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. మేము రూ.28 వేల వేతనం డిమాండ్ చేస్తున్నాం.

– ఎ.వీరవేణి, అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్, కాకినాడ రూరల్ ప్రాజెక్ట్

మెయిన్ సెంటర్లుగా మార్చాలి



తక్కువ మంది చిన్నారులు ఉన్న చోట మినీ సెంటర్లను ఏర్పాటు చేసి, హెల్పర్‌ను నియమించారు. వర్కర్, హెల్పర్ పనులన్నీ ఒకరే చేయాల్సి వస్తుంది. వేతనం మాత్రం రూ.7 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. అంగన్‌వాడీ సెంటర్లలో యాప్‌తో పని భారం ఎక్కువగా ఉంది. ఒకే యాప్‌ను అందుబాటులోకి తేవాలి.

– వి.వీరమణి, కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్

ఐఎల్‌ఏ నూతన కమిటీకి సత్కారం



ఐఎల్‌ఏ నూతన కమిటీని సత్కరిస్తున్న బార్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు

కాకినాడ లీగల్: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్‌ఏ)కు ఇటీవల నూతనంగా నియమితులైన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరిరావు, ట్రెజరర్ జేవీ రమణను కాకినాడ బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐఎల్‌ఏ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి చెక్క శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పేపకాయల రామకృష్ణ మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఐఎల్‌ఏ తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన న్యాయవాది అశోక్‌కుమార్‌ను కూడా సత్కరించారు.

లయన్స్ క్లబ్ సహృదయ ఆవిర్భావం



సహృదయ కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఈశ్వర్‌కుమార్ తదితరులు

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ చరిత్రలో దివ్యాంగులతో ప్రత్యేకంగా సహృదయ క్లబ్ ఏర్పాటు చేయడం అపూర్వ ఘట్టమని క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శ్రీశాంతి అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ అనుబంధంగా సహృదయ క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. దివ్యాంగుల క్లబ్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. క్లబ్ ఏర్పాటుకు సహకరించిన లయన్స్ సంకల్ప్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఇతర సభ్యులు మెట్టా రాధ, బాలాంత్రపు సుచిత్ర అభినందనీయులన్నారు. అనంతరం సహృదయ అధ్యక్షులుగా పి.సురేష్‌కుమార్, కార్యదర్శిగా బాపిరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులతో క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, ముంజులూరి విశ్వేశ్వరరావు, వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, సభ్యులు పున్నమి రాజు, సామా రాజేశ్వరి పాల్గొన్నారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి

యానిమేటర్ల సంఘం వినతి


కాకినాడ సిటీ: రాజకీయ కారణాలతో తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్న హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో యానిమేటర్ల సంఘ నాయకులు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ ఎ.శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు చెక్కల రాజ్‌కుమార్, గంగా భవాని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాజులూరు, తొండంగి, తుని, కోటనందూరు మండలాల్లో రాజకీయ వేధింపులకు పాల్పడుతూ, అప్పటివరకు పని చేస్తున్న వీవోఏలను తొలగించి తమ కార్యకర్తలను నియమించుకున్నారన్నారు. హైకోర్టు చాలా స్పష్టంగా గ్రామ సంఘం కార్యకలాపాలతో సెర్ప్ అధికారుల ప్రమేయం ఉండకూడదని, గ్రామ సంఘం ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, స్వతంత్రంగా పని చేసే వాతావరణాన్ని డీఆర్‌డీఏ అధికారులు కల్పించాలని పేర్కొందని వివరించారు. దీనికి భిన్నంగా గ్రామ సంఘం సమావేశాల్లో సెర్ప్ అధికారులు పాల్గొని, వీవోఏల తొలగింపును అంగీకరించకపోతే లోన్లు రాకుండా అడ్డుకుంటామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులకు అనుకూలంగా బలవంతపు తీర్మానాలు చేయిస్తున్నారని వివరించారు. తక్షణం రాజకీయ కారణాలతో తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోకపోతే పెద్దఎత్తున పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. వెంటనే కలెక్టర్ కలుగజేసుకుని, వీవోఏలను విధుల్లోకి తీసుకునేలా, హైకోర్టు తీర్పు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.వెంకటలక్ష్మి, డి.నాగమణి, దుర్గా, కె.సంధ్య, టి.నాగవరహాలు, ఎ.లక్ష్మీపార్వతి, ఎం.సరోజిని, జి.శ్యామల, ఎస్.ధనలక్ష్మి, వై.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తక్షణం మత్స్యకారులకు పరిహారం ఇవ్వాలి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మత్స్యకారులకు నష్ట పరిహారం, సీఎస్ఆర్ నిధులు సక్రమంగా విడుదల చేయాలని కోరుతూ మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రాంతాలకు చెందిన మత్స్యకారులకు మాత్రమే నష్ట పరిహారం ఇస్తున్నారన్నారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, కోనసీమ ప్రాంతాల్లో మత్స్యకారులకు నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. పరిశ్రమలు రావడానికి వ్యతిరేకం కాదని, సముద్ర తీర ప్రాంతాల్లో పరిశ్రమలు రావడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చేపల వేట కోసం వందల కి.మీ. దూరం వేటకు వెళుతున్న మత్స్యకారులకు తక్షణమే పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను వారు కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి, ఎమ్మెల్యేలు

పెద్ద బాధ్యతను అప్పగించారు



రమణయ్యపేటలో అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కన్నబాబు



కన్నబాబుకు పుష్పగుచ్ఛాలతో అభినందిస్తున్న పార్టీ శ్రేణులు



కురసాలను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ కో–ఆర్డినేటర్ కన్నబాబు

కాకినాడ రూరల్: నాపై నమ్మకం ఉంచి ఉత్తరాంధ్ర రీజియన్‌కు కో–ఆర్డినేటర్‌గా నియమించినందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు మాజీ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యాక తొలిసారిగా కాకినాడ చేరుకున్న కన్నబాబుకు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సోమవారం పెద్దఎత్తున అభినందనలు తెలిపారు. రమణయ్యపేటలోని వైద్యనగర్ కార్యాలయంలో ఆయనతో అభిమానులు కేక్ కట్ చేయించారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని, పార్టీ పటిష్టత కోసం పనిచేస్తూ మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. కన్నబాబుకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, కొప్పన శివ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించారని, శక్తివంచన లేకుండా పని చేసి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. నాయకులు, కార్యకర్తలతో మమేకమై పనిచేస్తానన్నారు. ఉత్తరాంధ్రలో వైఎస్సార్ సీపీ చాలా బలంగా ఉందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిశాక బాధ్యతలు చేపడతానన్నారు.

అభినందనల వెల్లువ

ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన కన్నబాబుకు కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, నాయకులు గోపిశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను, నక్కా సత్యనారాయణ, మేడిశెట్టి సత్తిబాబు, వలసపాకల సర్పంచ్ రామారావు, వేములవాడ శంకర్, భువనేశ్వరి, నల్లా రాణి, జాన్ ప్రభాకర్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలో దేశ భవిష్యత్తు

విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించిన వామపక్ష నేతలు

కాకినాడ సిటీ: ఫాసిస్ట్ పాలన సాగుతున్న నేటి కాలంలో విప్లవకార్ల ఐక్యత అత్యంత ఆవశ్యకమని, దోపిడీ, పీడన నుంచి విముక్తి కావాలంటే దేశ ప్రజలకు విప్లవాలే శరణ్యమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సమావేశం పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులు విలీన సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, మరుకుర్తి ఏసు, గుబ్బల ఆదినారాయణ మాట్లాడారు. ఎన్డీఏ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై పన్నుల భారం, ధరల భారం మోపుతూ, అంబానీ, అదానీ లాంటి పెద్ద పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ దేశాన్ని లూటీ చేయడానికి అవకాశం కల్పిస్తుందని విమర్శించారు. ప్రజలను మౌలిక సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికి మత విద్వేషాలు రెచ్చగొడ్తుందన్నారు. ఉత్తర భారతదేశంలో, ఈశాన్య భారతదేశంలో మత కల్లోలాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మణిపూర్ అందుకు తాజా ఉదాహరణ అని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి నూతన జాతీయ వ్యవసాయ విధానాన్ని తీసుకురావాలని చూస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని విమర్శించారు. ప్రస్తుతం దేశం దారుణంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూపాయి విలువ మరింత దిగజారి, ద్రవ్యోల్బణం పెరిగి, ధనవంతులు మరింత ధనవంతులు గాను, పేదలు మరింత పేదలుగా దిగజారారన్నారు. ఇలాంటి ఫాసిస్ట్ పాలనలో దేశ ప్రజలకు విప్లవకారుల ఐక్యత అత్యంత ఆవశ్యకమన్నారు. దేశ ప్రజలపై సాగుతున్న దోపిడీ, పీడనల నుంచి విముక్తి కావాలంటే విప్లవాలే శరణ్యమన్నారు. ఈ నెల 23న విజయవాడలో జరుగుతున్న విలీన సభను విప్లవ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాగుల రాఘవులు, జి.బాలరాజు, గరగ దుర్గారావు, బొడ్డు సత్యనారాయణమూర్తి, బంగార్రాజు, చంద్రరావు, తాతారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విలీన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీల ప్రతినిధులు

ఆర్ఎంసీలో అక్టోపస్ మాక్ డ్రిల్

కాకినాడ క్రైం: తీవ్రవాద చర్యల నిరోధక సంస్థ(అక్టోపస్) తరఫున కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో మంగళ, బుధవారాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో మాక్ డ్రిల్‌తో పాటు, రెక్కీపై కమాండోలకు అవగాహన కల్పిస్తారు. 40 మంది కమాండోలు రెండు రోజుల మాక్‌డ్రిల్‌లో పాల్గొంటారు. అకస్మాత్తుగా జరిగే తీవ్రవాద దుశ్చర్యలను ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా తిప్పికొట్టడమే ఈ శిక్షణ ముఖ్యోద్దేశం. ఆల్ఫా టీంగా నామకరణం చేసిన ఈ బృంద శిక్షణకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి ఏర్పాట్లు చేసింది.

పార్కును అభివృద్ధి చేయాలి

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం అన్నమ్మ చెరువు పార్కు అభివృద్ధి చేయాలని కోరుతూ దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం, ఉపాధ్యక్షుడు నందిక వీరబాబు సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఇద్దరు వాచ్‌మన్లకు అదనంగా మరొకరిని నియమించాలని, నిత్యం శానిటరీ సిబ్బందితో పార్కును శుభ్రం చేయించాలని కోరారు. ఆకతాయిలు, తాగుబోతులను నిరోధించాలని, పాడైన గేట్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

పాత్రికేయులపై దాడులు తగవు

బోట్‌క్లబ్: సమాచార హక్కు చట్టం ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు భంగం కలిగించడం రాజ్యాంగ విరుద్ధమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో పత్రికా సంపాదకునికి ఒక అధికారి బెదిరింపు తీరు, పార్వతీపురం మన్యం జిల్లాలో విలేకరిపై రాజకీయ దాడులకు పాల్పడడం దుర్మార్గపు చర్యలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బెదిరింపులకు, దాడులకు తెగబడడం అధికార దుర్వినియోగమన్నారు.

కాకినాడ సిటీ: జర్నలిస్టులపై దాడులను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ కలెక్టర్ షణ్మోహన్‌కు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో విలేకరిపై టీడీపీ నేత దాడి నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. విలేకరి రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు దాడి చేయడం, చంపుతానని బెదిరించడం దారుణమన్నారు. ఫెడరేషన్ నాయకులు జి.శోభనబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

తలరాత మారేలా..!

- మార్కులు సాధించడంలో చేతిరాతే కీలకం
- అక్షరాలు అందంగా, ఆకర్షణీయంగా ఉండాలి
- కలం ఎంపిక కూడా ముఖ్యమే..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పరీక్షలు వచ్చినప్పుడు విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుతారు. సమాధానాలు రాసేటప్పుడు చేతిరాత తీరు కూడా బాగుండాలి. ఏం రాశారన్నది సమాధాన పత్రం కరెక్షన్ చేసే వారికి అర్థమవ్వాలి. చేతి రాత అందంగా లేకపోతే మార్కులు అంతగా పడవు. ఇంటర్, పది పరీక్షల్లో చేతి రాత కీలక పాత్ర పోషిస్తుంది. టాపర్స్‌గా ఉండే విద్యార్థులు పరీక్షల్లో అందమైన దస్తూరితో రాయకపోతే మార్కులు తగ్గి, టాపర్స్ స్థానం కోల్పోయే అవకాశం ఉంటుంది.

పరీక్షలు ఎలా రాయాలంటే..


పరీక్షలు రాసేముందు రాత్రింబవళ్లు కష్టపడి చదివినవన్నీ గుర్తుండాలంటే ఒక్కసారి రాసి చూసుకోవాలి. ఇలా రాయడం వల్ల చదివినవి గుర్తుకొస్తున్నాయా, లేదా తెలుసుకోవచ్చు. అక్షర దోషాలుంటే సరి చేసుకోవచ్చు. దీనికి ఎంత సమయం వెచ్చిస్తున్నామో కూడా తెలుసుకోవచ్చు. ఆ తర్వాత పరీక్ష హాల్‌లో రాయడానికి సులువుగా ఉంటుంది.

చేతి రాత రాసే తీరు


పరీక్ష హాలులో ఇచ్చే సమాధాన పత్రంలో 14 నుంచి 16 లైన్లు రాయవచ్చు. ఒక్కొక్క లైన్ ఆరు నుంచి ఏడు పదాలు ఉండేలా చూసుకోవాలి. ఇంతకన్నా ఎక్కువ రాస్తే చేతిరాత ఇరికించినట్లుగా కనిపిస్తుంది. రాసేటప్పుడు ఎక్కడైనా తప్పుగా రాస్తే పదే పదే కొట్టేయకుండా పదాన్ని అడ్డగీతతో కొట్టి, తిరిగి పక్క నుంచి రాయాలి. ఎక్కువ తప్పులు రాయకుండా జాగ్రత్త పడాలి.

అక్షరాలు అందంగా..

వాక్యాలు, వాటిలోని పదాలు గజిబిజిగా లేకుండా స్పష్టంగా రాయాలి. కరెక్షన్ చేసేవారికి అవి అర్థమవ్వాలి. ప్రతి అక్షరానికి ప్రాముఖ్యమిస్తూ, పదాల మధ్య ఒక అక్షరమంత నిడివిని పాటించాలి. ఎన్ని మార్కుల ప్రశ్నకు సమాధానం ఏ మేరకు రాయాలో తెలుసుకుని అంతే రాయాలి. అవసరానికి మించి రాయడం వల్ల సమయం వృథా అవుతుంది.



తెలుగు దస్తూరి



ఇంగ్లిష్ దస్తూరి

పరీక్షల్లో చేతిరాతే ప్రధానం



పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చేతి రాతే కీలకం. ప్రశ్నాపత్రం కొట్టివేతలు, అక్షరదోషాలు లేకుండా చూడడానికి చక్కగా ఉండాలి. రాసింది కరెక్షన్ చేసే వారికి అర్థమయ్యేలా ఉండాలి. చేతి రాత బాగుంటే తల రాత బాగుంటుందని పెద్దలు చెబుతుంటారు. అనుకున్న మార్కులు సాధించాలంటే చదువుతో పాటు, చేతిరాత కూడా సాధన చేయాలి.

– ఎంవీఎల్ అపర్ణ, తెలుగు ఉపాధ్యాయుని, కాకినాడ

పెన్ను కూడా చాలా ముఖ్యం

పరీక్ష రాసేటప్పుడు పెన్ను కూడా చాలా ముఖ్యం. చేతిరాతకు ఏ పెన్ను వేగంగా రాయడానికి సాయంగా ఉంటుందో ఎంపిక చేసుకోవాలి. వేళ్ల మధ్య పెన్ను పట్టుకునే గ్రిప్ సరిగ్గా ఉండాలి. రాసేటప్పుడు వేళ్ల మధ్య పెన్‌ను గట్టిగా ఒత్తి పట్టుకోకూడదు. దానిపై చూపించే ఒత్తిడి కాగితం పైనా పడుతుంది. చేతితో పెన్ను తేలికగా ఉంటేనే వేగంగా సమాధానాలను రాయవచ్చు.